క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల: మండల కేంద్రానికి చెందిన తాటిపాముల ప్రియాంక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆమె పరిస్థితిని మల్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కటుకం వినయ్, కుటుంబ సభ్యులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబసభ్యులకు రూ.4లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి, ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు కోరెపు వెంకటేశ్, గుర్రం రంజిత్, కుసుమ వివేక్ పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో జగిత్యాల వాసులు



ప్రమాణ స్వీకారం చేసిన వాకర్స్ సభ్యులు

జగిత్యాలజోన్: వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో జగిత్యాల వాసులు చోటు దక్కించుకున్నారు. ఈ క్లబ్‌లో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న సంత గౌతమ్ రెడ్డి క్లబ్ డిప్యూటీ గవర్నర్‌గా, ఎస్‌కేఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎర్ర నర్సయ్య క్లబ్ సంయుక్త కార్యదర్శిగా, ధరూర్ క్యాంపు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న వెంకటేశ్వర్ రావు క్లబ్ జగిత్యాల జిల్లా కో–ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం హన్మకొండలో జరిగిన ఇంటర్నేషల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జగిత్యాల వాసులు ప్రమాణ స్వీకారం చేశారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

మెట్‌పల్లి: క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని లయన్స్ క్లబ్ మల్టీపుల్ లియో చైర్మన్ గోవిందరాజు అన్నారు. పట్టణంలోని వై కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన లయన్స్ క్లబ్ రీజియన్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. 150 దేశాల్లో క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వ కారణమన్నారు. క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శివశ్రీనివాస్, వడ్డెపల్లి శ్రీనివాస్, ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, నారాయణ రెడ్డి, కోదండరాం, తదితరులున్నారు.

ప్రధాని మోదీ, అద్వాణి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బుగ్గారం: మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ అద్వాణి భారత ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించడంతో మండలంలోని వెల్గొండలో ఆదివారం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లికొండ అనిల్ ఆధర్యంలో ప్రధాని మోదీ, అద్వాణి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పోషరాజం, తిరుపతి, హరీష్, నరేశ్, రమేశ్, రాజ్‌కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై సస్పెన్షన్ ఎత్తివేత

కోరుట్ల: బీజేపీ సీనియర్ నాయకుడు ఇందూరి సత్యంపై పార్టీ రాష్ట్ర నాయకత్వం సస్పెన్షన్ ఎత్తివేసినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఇందూరి సత్యం మాట్లాడుతూ తనపై సస్పెన్షన్ ఎత్తివేయడంలో సహకరించిన పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ అర్వింద్, జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు మోరపల్లి సత్యనారాయణరావుకు ధన్యవాదాలు తెలిపారు.

నిధులున్నా.. జాడలేని పనులు

- మండలంలో అధ్వానంగా రహదారులు
- ఉన్న రోడ్డు తీసేసి.. తారురోడ్డు వేయని వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



అసంపూర్తిగా మిగిలిన రహదారి

మేడిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలోని ప్రధానమైన రోడ్లలో కొండాపూర్ నుంచి ఒడ్యాడ్ వెళ్లే మార్గం ఒకటి. సుమారు పదేళ్ల క్రితం పోసిన తారు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ఆ రూట్లలో వెళ్లే వారికి నరకయాతన అనుభవిస్తున్నారు. కొండాపూర్ నుంచి విలయతాబాద్, కాచారం, వెంకటరావుపేట, రాగోజీపేట, ఒడ్యాడ్ మీదుగా ఈ ప్రధాన రహదారి వెళ్తుంది. రోడ్డు పక్కనే, మిషన్ భగీరథ పైపులైన్, ఇతరత్రా పనుల కారణంగా రోడ్డు దెబ్బతింది. దశాబ్దకాలం కింద వేసిన రోడ్డు కావడంతో అధ్వానంగా మారింది. ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మధ్యలోనే నిలిచిన కాచారం–దమ్మన్నపేట రోడ్డు

మరో ముఖ్యమైన రోడ్లలో కాచారం నుంచి దమ్మన్నపేట పోయే లింకు రోడ్డు ఒకటి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా సుమారు 1.90 కోట్ల విలువగల నిధులతో కాచారం నుంచి దమ్మన్నపేట వయా రంగాపూర్, కల్వకోట మీదుగా తారురోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు పూర్తి కాలేదు. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ పనులు పూర్తి కాలేదు. ఐదు కిలోమీటర్ల రోడ్డు ఏప్రిల్ 2023 పూర్తి కావాల్సి ఉండగా పూర్తి కాలేదు. ముందున్న తారురోడ్డు తీసేసి ఇప్పుడు రోడ్డుని మట్టిరోడ్డుగా మార్చి అధ్వానంగా చేశారని, అభివృద్ధిని ఆపేశారని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న గ్రామస్తులు కోపోద్రోక్తులు అవుతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వకోటలో బ్రిడ్జి నిర్మాణం సగంలోని ఆపేశారని , ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్నకొండాపూర్-ఒడ్యాడ్ రోడ్డు

మేడిపల్లి మండలంలో నాలుగు ప్రధాన రహదారులు ఉండగా ఒకటి మేడిపల్లి నుంచి పోరుమల్ల రూటు కాగా, రెండోది అత్యంత ప్రధానమైన రోడ్డు, మేడిపల్లి నుంచి మోత్కురావుపేట రోడ్డు ఇటీవల కాలంలోనే డబుల్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమై నడుస్తున్నాయి. మూడోది వల్లంపల్లి నుంచి దేశాయిపేట రోడ్డు, ఈ రోడ్డుకు ఇటీవల తారురోడ్డు వేశారు.

రోడ్లు వేయడం లేదు



అభివృద్ధి పేరుతో ఉన్న రోడ్లను తీసేశారు. కానీ ఏళ్లు గడుస్తున్నా.. కొత్త రోడ్డు వేయడం లేదు. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. నిధులున్నా. పనులు మాత్రం చేపట్టడం లేదు. ఇప్పటికైనా నూతన రోడ్లను త్వరగా పూర్తిచేయాలి.

– అస్లాం, కాచారం

రోడ్లు అభివృద్ధి చేయాలి



మా ఊరు ఉమ్మడి మేడిపల్లి మండలంలోని వెంకట్రావుపేట. వృత్తి రీత్యా నేను కరీంనగర్–వెంకట్రావుపేట తిరుగుతుంటాను. దశాబ్దకాలం క్రితం పోసిన రోడ్లు కావడంతో అస్తవ్యస్తంగా మారాయి. ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటే చుక్కలు కనబడుతున్నాయి. రోడ్లు అభివృద్ధి చేయాలి.

– వెంకటేశ్వర్ రావు, వెంకట్రావుపేట

ఆరు గ్యారంటీలతో పేదల అభ్యున్నతికి కృషి

మల్లాపూర్: ప్రజా ప్రభుత్వంలో ఆరు గ్యారంటీలను అమలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తారని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంతో పాటు రేగుంట, సిరిపూర్ గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు నాయకుడు, సుప్రీంకోర్టు అడ్వకేట్ కొమిరెడ్డి కరం, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో పక్కాగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో మరోసారి ఇందిరమ్మ రాజ్యం రాబోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి, ఎంపీటీసీలు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మరిపెల్ల సత్తెమ్మ, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

కాంగ్రెస్‌లో చేరిన ఎల్కా కమలాకర్

మల్లాపూర్ మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌కి చెందిన టీజేఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్కా కమలాకర్ నేతృత్వంలో పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో పార్టీలో చేరారు.

పారిశుధ్య పనులు పరిశీలన

కోరుట్ల: పట్టణంలోని రెండో వార్డులో కాంగ్రెస్ నాయకులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డులో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఇంట్లో పని చేసిన కార్మికులకు సంబంధించిన వేతనాల డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ తిరుమల గంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నయీం, నాయకులు నజీముద్దీన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల వాసులకు ఉమ్మత్ సొసైటీ అవార్డులు

కోరుట్ల: మహారాష్ట్రలోని ఖద్మిన్ ఉమ్మత్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ సామాజిక రంగాల్లో ఉన్నవారికి అందించిన అవార్డులు కోరుట్లకు చెందిన పలువురికి దక్కాయి. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆదివారం అందించారు. కోరుట్లకు చెందిన నొనిహాల్, క్రెసెంట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ బాఖీ ఇద్రిస్, అస్మ ఫాతిమా, పత్రికా రంగంలో పనిచేస్తున్న అబ్దుల్ ముసావీర్, మదర్సా రంగంలో హాఫీజ్, అబ్దుల్ రహీం తారిఖ్‌కు అవార్డులు దక్కాయి.

గోదాం భూమి విషయంలో రాజకీయం తగదు

కథలాపూర్: మండలంలోని పోతారంలో గోదాం నిర్మాణానికి స్థలం విషయంలో భూమి యజమానికి తెలుపకుండా పరిశీలన పేరిట బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం తగదని పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య అన్నారు. మండలంలోని పోతారంలో ఆదివారం మాట్లాడారు. గ్రామానికి చెందిన జక్కుల లక్ష్మీనారాయణ గోదాం నిర్మాణానికి 2 గుంటల సొంత స్థలం ఇవ్వాలని స్థానిక రైతులతో చర్చించారన్నారు. ఈ విషయంలో భూమి యజమానిని పూర్తిగా తెలుసుకోకుండానే.. గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన పేరిట మండల బీఆర్ఎస్ నాయకులు కుటీల రాజకీయాలు చేశారని మండిపడ్డారు. భూమి యజమాని లక్ష్మినారాయణ కాంగ్రెస్ పార్టీ అభిమాని అని, స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి భూమిని విరాళంగా ఇవ్వాలని అనుకుంటున్నారన్నారు. గోదాం నిర్మాణం విషయంలో పదేళ్లుగా ఏమి చేశారో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జక్కుల లక్ష్మినారాయణ, పులి హరిప్రసాద్, సిరికొండ రాములు, గంగరాజం, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తొట్ల అంజయ్య

మిషన్ భగీరథ నీటిలో కొట్టుకుపోయిన పసుపు పంట



కొట్టుకుపోయిన పసుపు

జగిత్యాల రూరల్: మండలంలోని పొలాస గ్రామ శివారుల్లో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై మిషన్‌భగీరథ నీరు లీకేజీ కావడంతో నిలువ చేసిన పంట కొట్టుకుపోయింది. గ్రామానికి చెందిన పడాల లక్ష్మణ్ అనే రైతు తన పొలంలో పసుపు పంటను తవ్వి నిలువచేశాడు. సాయంత్రం మిషన్‌భగీరథ పైప్‌లైన్ పగిలిపోయి భారీ ఎత్తున భగీరథ నీరు రావడంతో పంట చేనులో నిలువ చేసిన పంట కొట్టుకుపోయింది. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన చోటుచేసుకుని రైతుకు నష్టం వాటిల్లిందని, రైతును ఆదుకోవాలని పలువురు కోరారు.

కుంగ్‌ఫూతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది

ధర్మపురి: కుంగ్–ఫూతో ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందని డ్రాగన్ స్పోర్ట్ కుంగ్–ఫూ ఫౌండర్ రాజమల్లు అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ గార్డెన్‌లో ఆదివారం డ్రాగన్ స్పోర్ట్ కుంగ్–ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టుల ప్రదానోత్సవంలో పాల్గొని విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో టు ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ఎంతో మంచిదని, దీనికోసం ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్‌ను నేర్చుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కస్తూరి ప్రవీణ్, సీనియర్ మాస్టర్లు రమణ, ముజాయిద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



వివిధ బెల్టులు సాధించిన విద్యార్థులు

హోటల్ ఆనంద్ భవన్ సీజ్

జగిత్యాలటౌన్: జగిత్యాల బల్దియాతో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధంగా టౌన్ హాల్‌లో నిర్వహిస్తున్న హోటల్ ఆనంద్ భవన్‌ను ఆదివారం తెల్లవారుజామున బల్దియా అధికారులు సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హోటల్ సిబ్బందిని బయటకు పంపించి హోటల్ ప్రధాన ద్వారానికి తాళం వేసి సీల్ వేశారు. టెండర్ నిర్వహణ సమయంలోనే అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణకు తోడు బల్దియాతో కుదుర్చుకున్న ఒప్పందానికి విరుద్ధంగా ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్న కారణంతో అధికారులు హోటల్‌ను సీజ్ చేసినట్లు తెలుస్తోంది. టౌన్ హాలులో ఫంక్షన్‌హాల్ నిర్వహణకు ఒప్పందం జరుగగా నిర్వాహకులు దానికి విరుద్ధంగా హోటల్ నడుపుతున్నారన్న కారణంతో సీజ్ చేశారు. గతంలోనూ ఇదే విషయమై ఆరోపణలు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోగా తాజాగా హోటల్ సీజ్ చేయడం గమనార్హం.

నేడు ఇసుక డంపుల వేలం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట శివారులో నిల్వ ఉన్న ఇసుకకు నేడు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. వరదకాల్వ సమీపంలో నిల్వ ఉన్న సుమారు 282 ట్రిప్పుల ఇసుకకు వేలం వేస్తామని ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో పాల్గొనదలచిన వారు సోమవారం దరావత్ రూ.20 వేలు చెల్లించాలని పేర్కొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని పోచమ్మ తల్లి ఆలయంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



నేటినుంచి బీజేపీ గావ్ చలో.. బస్తీ చలో

కోరుట్ల: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నేటి నుంచి జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో..బస్తీ చలో ప్రారంభించినట్లు జిల్లా కన్వీనర్ పిసరి నర్సయ్య తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ కోరుట్లలో నిజామాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి వెంకటరమణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావులు, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, ధర్మపురి సెగ్మెంట్‌లో ఎస్.కుమార్, పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు సురభి నవీన్‌కుమార్, భోగ శ్రావణి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రామ గ్రామాన గావ్ చలో బస్తీ చలో నిర్వహించాలి

ధర్మపురి: గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని దేశమంతటా నిర్వహించనున్నట్లు ధర్మపురి అసెంబ్లీ కో–కన్వీనర్ బండారి లక్ష్మణ్ అన్నారు. పట్టణంలో ఆదివారం బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ అధ్యక్షతన గావ్ చలో బస్తీ చలో అభియాన్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధికి ఇంటింటికి వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి శ్రీనివాస్, ఓరుగంటి చంద్రశేఖర్, ఆకుల శ్రీనివాస్, స్తంభంకాడి శ్యామ్, తోట శ్రీనివాస్, మల్లేశ్, మధు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం మమత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కోరుట్ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నడికట్ల సంతోష్ కుమార్ 140 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో చేపడుతున్న భవన నిర్మాణం కోసం భూమిని చదును చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాంపర్తి రంజిత్, ఇమామ్, శంకరయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు

సారంగాపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో డ్రైయినేజీ నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు కాగా, ఈ పనులకు ఆదివారం ఇంజినీరింగ్ అధికారులు కొలతలు తీసుకున్నారు. ఎస్సీ కాలనీలో ఏళ్లుగా మురికి కాల్వల నీరు బయటకు వెళ్లక పోవడంతో నీరు కాలనీల్లోనే నిలబడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో కాలనీ వాసులు ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి సమస్య వివరించారు. దీనిపై స్పందించిన ఆయన రూ. 15 లక్షలు ఈజీఎస్ నిధులు విడుదల చేయించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ న్యారబోయిన గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయంకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు, పరిశుభ్రత మెరుగుపర్చాలని ఆదివారం కొడిమ్యాల మండల హిందు వాహిని కమిటీ సభ్యులు ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. సమ్మక్క –సారలక్క జాతర సమీపిస్తున్నందునా ఆలయానికి వచ్చే భక్తులకు కనీస వసతులు కల్పించాలన్నారు. కేశఖండనం వద్ద టిక్కెట్లు టోకెన్ సిస్టమ్ అమలు చేసి దోపిడీ అరికట్టాలన్నారు. కార్యక్రమంలో కమిటీ మండల అధ్యక్షుడు కోల సురేందర్,ప్రధాన కార్యదర్శి ఏంకాసుల సురేందర్, వేణు,అరవింద్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమల్లన్నస్వామి జాతర ఉత్సవాలు

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్‌లో శ్రీ గుట్టమీది మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాల్లో పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపెద్దలు, ఉత్సవ నిర్వాహకులు కృష్ణారావుకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజవర్గ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్‌రెడ్డి, తిరుమల గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రాత్మక స్థలాలను సందర్శించారు.9, 10 వ తరగతిలోని 51 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు రామప్ప గుడి, లక్నవరం, భద్రకాళి ఆలయం, వెయ్యి స్తంభాల గుడి, వరంగల్ ఫోర్ట్ తదితర ప్రదేశాలను సందర్శించారు. విద్యార్థులతో హెచ్ఎం కిషోర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్ జోడో యాత్రకు ఆదరణ కరువు

వెల్గటూర్ : కాంగ్రెస్ భారత్ జోడో న్యాయ యాత్రకు ఆదరణ కరువైందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మరిపెల్లి సత్యం అన్నారు. ఆదివారం వెల్గటూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం– బస్తీకి పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఆదివారం నుండి ఈ నెల 8వ తేదీ వరకు పార్టీ పటిష్టతకు ప్రతీ బూత్ స్థాయిలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ వెల్గటూర్ మండల అధ్యక్షులు గోపతి జనార్దన్, సంగ వెంకటగిరి, కాశ నరేశ్, చెల్ల శ్రీనివాస్, కండెం ప్రభాకర్, పాల్గొన్నారు.

సమాచారం..

కాంగ్రెస్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా రాజం గౌడ్



రాజం గౌడ్

కోరుట్లరూరల్: కాంగ్రెస్ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శిగా ముంజ రాజం గౌడ్ నియమితులయ్యారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశం ఆధ్వర్యంలో కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుంతం రాజం,కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి శంకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

టీచర్స్ క్లబ్ అధ్యక్షునిగా అందె శివప్రసాద్



శివప్రసాద్

కోరుట్ల: పట్టణంలో టీచర్స్ క్లబ్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా అందె శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా జుంబర్తి శంకరయ్య, రామారావు, ప్రధాన కార్యదర్శిగా కోకిల కృష్ణ, కోశాధికారిగా అంబటి భూమేశ్వర్, సహాయ కార్యదర్శులుగా ఎక్కల్‌దేవి రవి, నడిగడ్డ రాజు, ఆడిటర్లుగా సత్యనారాయణ, కృష్ణరాజన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సాహిత్య వికాస వేదిక జిల్లా కార్యవర్గం ఎన్నిక



లింబగిరి స్వామి

మెట్‌పల్లి: సాహిత్య వికాస వేదిక(ఉదయ సాహితి) జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గుర్రాల మాధవ్ అధ్యక్షుడిగా పెరంబుదూరు లింబగిరి స్వామి, ఉపాధ్యక్షులుగా మార విజయలక్ష్మి, చిలకమర్రి విజయలక్ష్మి, మద్దెల సరోజన, ప్రధాన కార్యదర్శిగా మద్దెల ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా కటుకం కవిత, ముత్యపు భాగ్యలక్ష్మి, కోశాధికారిగా జయంతి సుధాకర్, ప్రచార కార్యదర్శిగా అయిత అనిత, కార్యవర్గ సభ్యులుగా లావణ్యను ఎన్నుకున్నారు.

వైశ్య సంఘం నూతన కార్యవర్గం

పెగడపల్లి: మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్ది శ్రీరాములు ప్రధాన కార్యదర్శిగా వెలుకంటి లింగన్న, గౌరవ అధ్యక్షుడిగా బేతి వైకుంఠం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కట్టం భాస్కర్, కోశాధికారిగా బేతి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చెట్ల శ్రీనివాస్, ఎర్ర వెంకటేశం, అనంతుల మునీందర్, క్యాస రమేశ్, అధికార ప్రతినిధిగా ఎలిమెల్ల ప్రసాద్, సలహాదారులుగా వెలుకంటి కిషన్, పెద్ది భూమయ్య, గంప వెంకటరమణ, పుల్లూరి సత్యనారాయణ, ఆదిపురి నర్సయ్య, కొలిపాక సురేశ్ ఎన్నికయ్యారు.


పోపా జిల్లా కార్యవర్గం ఎన్నిక



కొక్కుల రాజేశ్

జగిత్యాలటౌన్: జిల్లా పద్మశాలీ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ (పోపా)అధ్యక్షుడిగా కొక్కుల రాజేశ్, అసోసియేట్ అధ్యక్షుడిగా చాప కిశోర్ ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీభక్తమార్కండేయ మందిరంలో జిల్లా పరిషత్ సీఈవో రఘువరన్ పర్యవేక్షణలో జరిగిన పోపా ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా ఏవీఎస్ రాజు ప్రధాన కార్యదర్శిగా దండె గోవర్ధన్, ఆర్థిక కార్యదర్శిగా మచ్చ శంకర్, ఉపాధ్యక్షులుగా పల్లె ధనుంజయ్, భోగ శివప్రసాద్, వీరబత్తిని రాజశేఖర్, రాజారాం, శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాళ్లుగా మోర రోజ, అనుమల్ల లతాదేవి, బొద్దున సునీత, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా నిర్వాహకులు తెలిపారు.

ఆట, పాటలతో వీడ్కోలు



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఆట, పాటలతో 10వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆట, పాటలతో సీనియర్లకు వీడ్కోలు పలికారు.కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.